దయనీయం.. పేదల కల్యాణ మండపం

- నిర్వహణను గాలికి వదిలేసిన జీవీఎంసీ
- వేలం ధర ఎక్కువగా నిర్ణయం
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- శిథిలావస్థకు చేరిన భవనం



గోడలు కూలి విడిది గది



ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద నిరుపయోగంగా ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం ఆఖరి బస్ స్టాప్ వద్ద జీవీఎంసీ నిర్మించిన కల్యాణ మండపం శిథిలావస్థకు చేరింది. ఈ భవనాన్ని జీవీఎంసీ నిర్మించి సుమారు 8 ఏళ్ల క్రితం వినియోగంలోకి తీసుకొచ్చింది. సుమారు మూడేళ్ల పాటు ప్రజలు దీనిని వినియోగించుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వారంతా అధిక శాతం మంది పేదలే. వారికి తక్కువ ధరకు ఈ మండపం అందుబాటులో ఉండేది. దీంతో ఇది పేదల కల్యాణ మండపంగా పేరొందింది. విశాలమైన ఖాళీ స్థలం ఉండడంతో ఈ ప్రాంతీయులు ఇక్కడే ఎక్కువగా శుభకార్యాలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు శిథిలావస్థలో ఉండడంతో ఫంక్షన్ల నిర్వహణకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఓ పక్క పేదలు అవసరాలు తీరకపోవడంతో పాటు జీవీఎంసీకి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడింది. జీవీఎంసీకి సంవత్సరంలో రూ.లక్షల్లో ఆదాయం తెచ్చిపెట్టే ఈ మండపం.. ఇప్పుడు రూ.వేలల్లో కూడా ఆదాయం అందించలేకపోవడం విశేషం.

పేదలకు దూరం

ఆరిలోవ కాలనీ నుంచి నలభై గజాలు, ఆపరేషన్ కాలనీ, పాండురంగాపురం, కనకమహాలక్ష్మీనగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, లక్ష్మీనగర్, ఏఎస్ఆర్ నగర్, దుర్గానగర్, దుర్గాబజార్, లీలాసుందరినగర్,



విరిగిన రేకులతో వంట గది

నెహ్రూనగర్, టీబీసీ పాయింట్‌తో పాటు కొండవాలులో దీన్‌దయాల్‌పురం నుంచి చినగదిలి వరకు వేల కుటుంబాలున్నాయి. వారందరికీ ఈ కల్యాణ మండపం అందుబాటులో ఉండేది. ఆయా ప్రాంతాలలో ఎక్కడా ఖాళీ స్థలాలు లేవు. ఈ మండపం అందుబాటులో లేకపోవడంతో ఫంక్షన్లకు ప్రైవేట్ హాళ్లను బుక్ చేయాల్సిందే. లేదంటే ఇంటి ముందు రోడ్డు మీదే టెంట్ వేసుకుని నిర్వహించుకోవాల్సిందే. దీని వల్ల నిత్యం ఆ వీధులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జీవీఎంసీ అధికారులు కల్యాణ మండపం నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. అధికారులు నిర్ణయించిన ధరలకు ప్రజలకు ఫంక్షన్లు చేసుకోవడానికి అద్దెకు ఇచ్చేవారు. ఇక్కడ పేదలను దృష్టిలో పెట్టుకొని అధికారులు అందుబాటులో ఉన్న ధరలనే నిర్ణయించారు. దీంతో స్థానికులకు ఈ మండపం ఉపయుక్తంగా ఉండేది. జీవీఎంసీ సుమారు ఐదేళ్లుగా ఈ మండపం నిర్వహణను గాలికి వదిలేయడంతో అస్తవ్యస్తంగా మారిపోయింది. చెత్తాచెదారంతో నిండిపోయింది. అయినా ప్రతి సంవత్సరం వేలానికి మాత్రం పిలుస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదు.

తక్షణం అందుబాటులోకి తీసుకురావాలి



ఆరిలోవ కాలనీలోని కల్యాణ మండపం పేదలకు అందుబాటులో ఉండేది. వేలం ధర రూ.56 లక్షలుగా నిర్ణయించడంతో ప్రైవేట్ నిర్వాహకులు పాడడానికి ముందుకు రావడం లేదు. దీంతో కొన్ని సంవత్సరాలుగా అధికారులే దీన్ని నిర్వహిస్తున్నారు. బాత్‌రూంలు, విశ్రాంతి గదులు, వంట గది శిథిలమయ్యాయి. ఇక్కడున్న పేదలను దృష్టిలో పెట్టుకుని ఈ కల్యాణ మండపాన్ని ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నాం.

– కెల్ల సునీత, కార్పొరేటర్, 13వ వార్డు

56 జీవో ప్రకారం వేలం ధర నిర్ణయం

కల్యాణ మండపం నిర్వహణకు వేలం ధర ఎక్కువగా ఉంది. అందుకే ఎవరూ ముందుకు రావడం లేదు. 56 జీవో ప్రకారం అత్యధికంగా వేలం ధర నిర్ణయించడంతో ఈ పరిస్థితి వచ్చింది. వారం రోజుల కిందట అంక్షన్‌కు పిలిచినా నిర్వాహకులు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీని గురించి జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. కల్యాణ మండపం శిథిలావస్థ పరిస్థితిని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కనకమహాలక్ష్మి, జోన్–2 కమిషనర్

అదుపు తప్పి కాంక్రీట్ మిక్సర్ లారీ బోల్తా



బోల్తా పడిన కాంక్రీట్ మిక్సర్ లారీని పైకి లేపుతున్న క్రేన్‌లు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో కాంక్రీట్ మిక్సర్ లారీ బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో అడవివరం వైపు నుంచి కాంక్రీట్ మిక్సర్ లారీ హనుమంతవాక వైపు బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్తుంది. రామకృష్ణాపురం సమీప ముడసర్లోవ డంపింగ్ యార్డు కూడలి దాటిన వెంటనే ఆ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడి రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయింది. దీంతో ఈ లైన్‌లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు, ఎస్ఐ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను పక్కనున్న మరో లైన్ ద్వారా మళ్లించారు. వాహనం యజమాని రెండు క్రేన్‌లు తీసుకొచ్చి బోల్తా పడిన మిక్సర్ వాహనాన్ని మధ్యాహ్నం 2 గంటలకు పక్కకు తరలించారు. ఇదిలా ఉండగా కాంక్రీట్ మిక్సర్ బోల్తాపడిన సమయంలో దాని ముందు, వెనుక సమీపంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మిక్సర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మితిమీరిన వేగంతో వాహనం నడపడమే అదుపుతప్పిందని స్థానికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

చేపల మార్కెట్ నిర్మాణానికి వినతి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో ప్రత్యేకంగా చేపల మార్కెట్ నిర్మించాలని తోటగరువు, గాంధీనగర్ చేపల వ్యాపారులు కోరారు. ఈ మేరకు గేటర్ విశాఖ నగర మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో తోటగరువు, గాంధీనగర్ ప్రాంతాలలో చేపల వ్యాపారం చేస్తున్న మహిళలు సోమవారం పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో చేపల మార్కెట్ లేకపోవడంతో ఎండలో చేపలు విక్రయించాల్సి వస్తుందని, ఎండకు చేపలు ఎండిపోయి పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన మేయర్ ఈ విషయాన్ని అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో 12వ ఆరాధన మహోత్సవం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా 12వ ఆరాధన మహోత్సవాన్ని సోమవారం శ్రీసత్యసాయి విశాఖ సిటీ సేవా సమితి ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ప్రేమ సదన్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా సహస్రనామ పుష్పార్చన, శ్రీసత్యసాయి గాయత్రి విశ్వశాంతి హోమం చేశారు. 1000 మందికి పైగా మహా నారాయణ సేవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం 108 మంది పేదలకు దుప్పట్లు, 96 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సిటీ సేవా సమితి కన్వీనర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పప్పెట్ స్టోరీ టెల్లింగ్ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: పప్పెట్ స్టోరీ టెల్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు చిన్నారులకు పెపప్ సంస్థతో కలిసి జెమ్స్ ఎడ్యుకేషనల్ ఆర్గనైజింగ్ సంస్థ ఆహ్వానం పలుకుతోంది. పెపప్ మూడో ఎడిషన్ నిర్వహణలో భాగంగా మే 6న నగరంలోని రామ్‌నగర్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ పోటీలు నిర్వహిస్తుంది. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు ఫైనల్ రౌండ్ పోటీలు, 4.30 నుంచి 5.30 వరకు షాడో పప్పెట్ వర్క్‌షాపు, 6.30 నుంచి 7.30 వరకు పప్పెట్ షో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే చిన్నారులు 4 నిమిషాల వ్యవధిలో రికార్డ్ చేసిన స్టోరీని ఈ నెల 30లోగా 98494 88923కు వాట్సాప్ ద్వారా లేదా artoflearning22@gmail.comకు మెయిల్ చేయాలని కోరారు. స్టోరీకి మెటీరియల్ గ్లోవ్, స్ట్రింగ్, రాడ్, ఫింగర్, షాడోలను ఉపయోగించి ఫన్నీ, హర్రర్, ఫాంటసీ, మోరల్ ఆధారిత అద్భుత కథలు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 90190 67760, 98494 88923లో సంప్రదించాలని నిర్వాహకురాలు కె.అమలారెడ్డి కోరారు.

రంగస్థల నటుడు కోరిబిల్లి ఆకస్మిక మృతి



మాధవరావు (ఫైల్ ఫొటో)

పెదగంట్యాడ: స్టీల్ హెచ్ఎంఎస్ మాజీ అధ్యక్షుడు, రంగస్థల నటుడు కోరిబిల్లి మాధవరావు (69) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కుకు చెందిన ఆయన 40 ఏళ్ల పాటు నాటక రంగానికి సేవలందించారు. 'నుదుటి రాత' అనే నాటకంలో రాజశేఖరం అనే తండ్రి పాత్రలో మెరిశారు. ఆ పాత్రకు నిండుదనం తీసుకువచ్చారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడం నాటక రంగానికి తీరని లోటని శ్రీసీతారామ నాట్య కళా సమితి ప్రతినిధులు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మా భవిష్యత్తుకు జగనన్నే కావాలి

- మెజార్టీ శాతం ప్రజలు అదే కోరుకుంటున్నారు
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ : రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు జగనన్ననే విశ్వసిస్తున్నారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న మెగా పీపుల్స్ సర్వే ప్రజల అభిప్రాయాన్ని తెలియజేసేందుకు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కోటి కుటుంబాలను ఈ సర్వేలో భాగస్వాములను చేయగా 79 శాతం జగనన్న పాలనపై విశ్వాసం కనబరిచారన్నారు. తూర్పు నియోజకవర్గంలో సైతం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలని ప్రజలు పెద్ద ఎత్తున కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 30 వేల ఓట్ల మెజారిటీతో తూర్పు నియోజకవర్గం సీటును గెలుచుకోనున్నట్లు ఎంవీవీ వెల్లడించారు. అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్‌కే ప్రసాద్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: భారత క్రికెట్ టీం సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ జన్మదిన వేడుకలను హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి దరి పాఠశాల ఆవరణలో విద్యార్థులు కేక్ కట్ చేశారు. ఎంఎస్‌కే ప్రసాద్ స్నేహితులు రామ్ కిషోర్(రైల్వే టీసీ), డాక్టర్ అనీల్ కుమార్(డీజీఎం స్టీల్‌ప్లాంట్), సతీష్‌రెడ్డి బీసీసీఐ ట్రైనర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యార్థులు వీడియో కాల్ ద్వారా ఎంఎస్‌కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కండిపిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా పాఠశాల విద్యార్థులు ఎమ్మెస్కే జన్మదినాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

సంక్షేమమే ధ్యేయంగా ప్రజారంజక పాలన

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- 16వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం'



16వ వార్డులో పథకాల గురించి వివరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

మద్దిలపాలెం: సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకమైన పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఇంత వరకూ పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని ఆమె సూచించారు. పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. వివక్షకు తావులేకుండా అర్హులకు పథకాలు మంజూరు చేయాలని సచివాలయ సిబ్బందిని అక్కరమాని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, ఒమ్మి పోలరత్నం, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిరక్షణకు మరో ముందడుగు'



802వ రోజు ఉక్కు దీక్షలో కూర్చున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును కాపాడుకొనే క్రమంలో కార్మికులంతా మరో ముందడుగు వేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 802వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయని బీజేపీతో సహా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి సహకరించని అన్ని రాజకీయ పార్టీలపై ప్రజలు స్వచ్ఛందంగా తమ నిరసన తెలియజేయాలన్నారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణకు ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

27 నుంచి వేసవి శిక్షణ శిబిరం

బీచ్ రోడ్డు: పిల్లల కోసం ఈ నెల 27వ తేదీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎరిబిక్స్, ఎయిర్ గన్, కాలిగ్రఫీ, చెస్, క్రికెట్, డ్యాన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, జుడో, కరాటే, గిటార్ అండ్ కీ బోర్డు, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, యోగా, తదితర అంశాలలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మే 31వ తేదీ వరకు సాగనున్న ఈ శిబిరంలో 5 నుంచి 17 ఏళ్ల వయస్సు వారు పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0891–2755826, 82972 23480 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఆస్తి పన్ను రాయితీకి విశేష స్పందన

- జోన్–3 పరిధిలో రూ.22 కోట్లు వసూళ్లు
- 5 శాతం రాయితీతో 21 వేల మంది చెల్లింపు
- ఈ నెలాఖరు వరకూ గడువు

మద్దిలపాలెం: జీవీఎంసీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుపై కల్పించిన 5 శాతం రాయితీ విధానానికి విశేష స్పందన లభిస్తోంది. ఆస్తి పన్ను ఏడాదికి రెండు సార్లు చెల్లించాలి. అదే ఒకేసారి ఏడాది మొత్తాన్ని చెల్లిస్తే 5 శాతం రాయితీ సదుపాయం కల్పించారు. దీంతో ప్రజలు తమ పన్నులను ముందుగా చెల్లించి ప్రభుత్వ కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. జోన్–3 పరిధిలో ఈ ఏడాది పన్ను వసూలు లక్ష్యం రూ.40 కోట్లు కాగా.. విస్తృత ప్రచారం చేయడంతో ఇప్పటి వరకూ సుమారు 21 వేల మంది ఈ రాయితీని సద్వినియోగం చేసుకున్నారు. రూ.22 కోట్ల పన్ను వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో 34.03 కోట్లు వసూలు చేశారు. ఈ నెలాఖరు వరకూ గడువు ఉండడంతో గతేడాది లక్ష్యాన్ని మించి వసూళ్లు చేయడానికి జీవీఎంసీ జోన్–3 రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆటోలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రాయితీపై పన్ను చెల్లింపునకు అధికంగా కార్పొరేటర్ సంస్థలు, వాణిజ్య సంస్థలు మక్కువ చూపిస్తున్నారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1 చివరలో గల పార్సిల్ ఆఫీస్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ వి.బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ప్లాట్‌ఫారం–1 చివరలో సుమారు 25 ఏళ్ల గల ఓ వ్యక్తి మరణించాడని, తెలుపు రంగు ప్యాంట్, తెలుపు నలుపు రంగు చెక్స్ గల రౌండ్ నెక్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని బాలాజీరావు చెప్పారు. ఇతని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీని గానీ లేదా 96661 22722 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలన్నారు.

'ఏడాదిలో ఏఐటీయూసీతో ఒరిగింది శూన్యం'



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచి ఏడాది పూర్తయినా కార్మికులకు ఒరిగిందేమి లేదని స్టీల్ ఐఎన్‌టీయూసీ, మిత్రపక్షాల నాయకులు ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల ప్రధాన డిమాండ్ వేతన ఒప్పందం చేయలేకపోయారన్నారు. ప్రైవేటీకరణ ఉద్యమంలో భాగంగా ఢిల్లీకి వెళ్తే తామే వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఉక్కు మంత్రి, ఉక్కు కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం తప్ప, ఏఐటీయూసీ, సీఐటీయూ చేసిందేమి లేదన్నారు. అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీలు ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, హెచ్‌బీఏ, వర్క్ డ్రస్, ఇన్సెంటివ్ తగ్గింపు వంటి ఆర్థిక అంశాలపై కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, ఉక్కు శ్రామిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు ఎంఆర్‌సీ గ్రూపు నిధులు



వీసీకి లేఖ అందిస్తున్న కొమ్మురెడ్డి రాంబాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు ఎంఆర్‌సీ గ్రూప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మురెడ్డి రాంబాబు నిధులు అందజేశారు. తమ సంస్థ పేరుతో ఏయూలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖతో పాటు ఇందుకు అవసరమైన నిధులను సైతం చెక్ రూపంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి సోమవారం ఉదయం అందజేశారు. విద్యను అందించి తమ అభివృద్ధికి దోహదపడిన విశ్వవిద్యాలయం సాధిస్తున్న ప్రగతి తనకు ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తోందని రాంబాబు అన్నారు. వర్సిటీ అభివృద్ధిలో తామంతా భాగస్వాములం అవుతామన్నారు. ఏయూలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు ముందుకువచ్చిన ఎంఆర్‌సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, ది కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ కొమ్మురెడ్డి రాంబాబును వర్సిటీ తరఫున వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పాలక మండలి సభ్యుడు కె.వి.ఎస్.ఆంజేయవర్మ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్ : రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ మేరకు రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు, గ్రంథ పాలకులు జమ్మా చిన్నబాబు సాయంత్రం వీసీని కలిసి వార్షికోత్సవ వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం విశాఖ నగరంలో ఉండడం గర్వకారణమన్నారు. 11 ఏళ్లలో 10 వేలకు పైగా నాటక పుస్తకాలు సేకరించడం సాధారణ విషయం కాదని ఆయన కొనియాడారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో 26వ తేదీ ఉదయం 10 గంటలకు వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు బాదంగీర్ సాయి తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రముఖ నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పి.టి.మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతిరావు, రావి నాగేశ్వరరావును సత్కరించనున్నామన్నారు. కన్యాశుల్కం లఘు నాటిక, ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం హాస్య ప్రహసనం ఉంటాయని సాయి వివరించారు.

పారిశుధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అడవివరంలో పారిశుధ్య పనులపై అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: సింహగిరితో పాటు అడవరం, కొండదిగువన పారిశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను ఆదేశించారు. చందనోత్సవం అనంతరం సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. పాత అడవివరం జంక్షన్ నుంచి పాత గోశాల గోశాల వరకు ఎక్కువగా వ్యర్థాలు ఉన్నాయని రెండు పూటలా పారిశుధ్య కార్మికులను ఉంచి శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలించే వాహనాలు అదనపు ట్రిప్పులు వేయాలని ఆదేశించారు. వ్యర్థాలు తరలించేటప్పుడు వాహనాలకు తప్పనిసరిగా నెట్ ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఈఈ సంతోషి, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.